# శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యము

## శ్రీ బ్రహ్మపురాణాంతర్గత శ్రీ భద్రమహర్షి చరిత్రము



శ్రీ భద్రాచల శ్రీసీతారామచంద్రార్పణమస్తు


**సేకరణ కర్త**

**అమరవాది వైజయంతి మాల**

సెల్ : 9000005731

ప్రథమ ముద్రణ : జూన్ 2019
ప్రతులు : 2000

**శ్రీమతి అమరవాది వైజయంతి మాల**
W/o. **శ్రీ అమరవాది వెంకటాచార్యులు**
ఇ.నెం. 5-5-1091, బ్యాంక్ కాలని,
విష్ణుథియేటర్ ఎదురుగా, చింతలకుంట, హైదరాబాదు-500068.
సెల్ : 9000005731

డి.టి.పి. : **డి. శ్రీనివాస్**
ముద్రణ : **ముద్రికా గ్రాఫిక్స్**
వనస్థలిపురం, హైదరాబాదు - 500070.
సెల్ : 9848481629

**సర్వహక్కులు సేకరణ కర్తవి**
**వెల : అమూల్యం**

# సేకరణకర్త ఉపోద్ఘాతము

నేను పొడిచేటి (అమరవాది) వైజయంతిమాల కీ॥శే॥ శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు గారు, శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యం గ్రంథకర్త మరియు అర్చకులు శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, భద్రాచలం వారి కుమార్తెను.

గత 60 సంవత్సరాల క్రితం శ్రీ రామాజ్ఞతో శ్రీమాన్ పొడిచేటి శ్రీ రంగాచార్యులు గారు శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యం గ్రంథాన్ని రచించ పూనుకున్నారు. నాడు వారి మామగారు శ్రీమదుభయ వేదాంత ప్రవర్తకేత్యాది శ్రీమాన్ అమరవాది వేంకట రామానుజాచార్యులు గారు సైతం వారి చిరకాల కోరిక మేరకు బ్రహ్మ పురాణమందు శ్రీ గౌతమీ మహాత్మ్య కథావసరమున సూత మహర్షి శ్రీ శౌనకాది మహామునులు కెరింగించిన శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యము భక్తులకు తెలియజేయవలయునను కోరికతో ఆ బాధ్యతను శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు గారిని కోరగనే వారు అత్యంత ఆనందముతో చిన్ని క్షేత్ర మహాత్మ్య గ్రంథమును రచించి 2000 ప్రతులు ప్రచురించి భక్తులకంద చేసి యున్నారు.

నేను శ్రీమాన్ అమరవాది రామానుజాచార్యుల గారు రచించిన చిన్న గ్రంథము నుండి శ్రీ బ్రహ్మపురాణాంతర్గత శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యమును మాత్రమే గ్రహించి అందలి శ్రీ భద్ర మహర్షి చరిత్రను, భద్రాచల క్షేత్ర మహాత్మ్యము ప్రమాణములను సేకరించి సమర్పిస్తున్నాను.

చిన్న గ్రంథం రచించిన కొంత కాలం తరువాత దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకే శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యం గ్రంథాన్ని అధికారికంగానే ప్రచురించాలని సంకల్పం కలిగి ఆ గ్రంథ రచనకు నాటి సంస్కృతాంధ్ర పండితులు శ్రీ యస్.టి.బి.వి. కూర్మాచార్యులు దేవాదాయ శాఖ ట్రస్టు బోర్డు మెంబరు గార్కి

మరియు పండిత ప్రముఖులు, దేవస్థానం అర్చకులు శ్రీమాన్ పొడిచేటి శ్రీ రంగాచార్యులు గార్కి వప్పు చెప్పగా, వారు అనేక చారిత్రక విషయములు సేకరించి నాటి నవీన విషయములు, పరివర్తనలు సైతం క్రోడీకరించి శ్రీ స్వామి వారి మహాత్మ్యమును భక్తుల కంద చేయుటకు ప్రమాణ పూర్వకమైన గ్రంథాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దినారు మరియు దేవాదాయ ధర్మాదాయ కమీషను వారు అట్టి గ్రంథాన్ని ఆమోదించి మరియు ఆ గ్రంథ ప్రచురణకు శ్రీ భద్రాచల దేవాలయం తరపున ముద్రించటానికి అనుమతినిచ్చారు. భద్రాచలం దేవస్థానం వారు 1983 సం॥లో 10,000 ప్రతులు ముద్రించారు. (కాని ఆ ప్రతులు నేడు మిగిలి లేవు)

**"క్షేత్ర మహాత్మ్యం లేని క్షేత్రం, దేముడు లేని గుడి వంటిది"** అంటారు కదా!

మరొక విషయం; ఆధారాలు ప్రమాణాలు ఉన్నాయి కాబట్టి తెలియ చేస్తున్నాను.

నేడు కొందరు భక్తులు, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అర్చకులు శ్రీరామనవమి శ్రీరామ చంద్రస్వామి కల్యాణం లోను, నిత్య కల్యాణాలలోను "శ్రీరామ చంద్రస్వామినే వరాయ" అని చెప్పటానికి బదులు శ్రీరామ నారాయణునే వరాయ అని చెప్తున్నట్లు బాధ పడ్తున్నారు ఆరోపిస్తున్నారు.

"శ్రీరామ నారాయణునే వరాయ అని తెల్పటానికి అర్చకులు వద్ద ఎట్టి ఆధారము కానీ ప్రమాణము కానీ లేవు. కాని ... వారు శ్రీరామ చంద్రస్వామి వార్కి మూడు పేర్లున్నాయని...

అవి 1) ఓంకార రాముడు

2) వైకుంఠ రాముడు

3) రామ నారాయణుడు అని శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగా చార్యులు గారు వ్రాసిన గ్రంథంలో వున్న వాటినే పేర్కొంటున్నారు. మరి ఆయన రచించిన క్షేత్ర మహాత్మ్యం గ్రంథాలనే గోదావరిలో పారవేసినవారు మరి ఆయన రచించిన క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో పేర్కొన్న ఈ మూడు పేర్లను ప్రమాణంగా ఎందుకు తీసుకున్నారో ? ఈ సందర్భంలో నేను తెలియ జేయటం ఏమనగా పై మూడు పేర్లు శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో వున్న మాట వాస్తవమే, కాని గ్రంథ కర్త పై పేర్లను కల్యాణ మహోత్సవాల సందర్భంలో ప్రవరలలో చెప్పమని ఎక్కడా తెలియ జేయలేదు, వివరించలేదు, ప్రస్తావించ లేదు, ప్రకటించలేదు, ఎందుకంటే అవి నారాయణ స్వామి కొన్ని బిరుదులు మాత్రమే. కాబట్టి దేవాలయ అర్చకుల వాదన నిరాధారము. అంతే కాక భద్రుని శిరమున వెలసినది శ్రీరామ చంద్రమూర్తే తప్ప శ్రీరామ నారాయణుడు కాదు.

దానికి ఈ భద్ర మహర్షి చరిత్రే ప్రమాణము.

## బ్రహ్మ పురాణాంతర్గత ప్రమాణం సంక్షిప్తంగా తెల్పుతున్నాను

భద్రాచల ప్రశస్తికి, ప్రాదుర్భావానికి మూల కారకులు, మూల పురుషులు యిద్దరు ఒకరు **శ్రీ భద్రమహర్షి** రెండవ వారు **శ్రీరామ చంద్ర మహా ప్రభువు** వారు.

శ్రీ భద్రుడు గత జన్మలో శిలగా వున్నపుడు శ్రీ సీతారామ చంద్ర స్వామి లక్ష్మణుల వారు అరణ్య వాస సమయంలో ఒక శిలపై విశ్రమించి, అలసట తీర్చుకున్నందుకు గాను కృతజ్ఞతగా ఆ శిలకు నీవు రాబోయే కాలంలో నా భక్తుడవై జన్మిస్తావు అని వరం యిచ్చారు.

ఆ విధంగా భద్రుడు గత జన్మ అనుభూతులు కలవాడై శ్రీరామ చంద్రస్వామి కోసం అనేక వేల సంవత్సరాలు ఘోర తపమాచరించాడు. భద్రుని తపస్సుకు మెచ్చిన ఆ శ్రీరామచంద్రమూర్తి అతని పైన అవ్యాజమైన ప్రేమతో అతని ఎదుట ప్రత్యక్షమై ఏదేని వరం కోరుకొమ్మనెను.

అంతట భద్రుడు :-

**శ్లో॥ యది దాస్యతి మేదేవ వరం వరద సత్తమ**
**అనేన ప్రసన్న రూపేణ మమ మూర్ధ్నని**
**శంఖ చక్ర ధనుర్బాణ సీతాలక్ష్మణ సంయుతః**
**నివసత్వం రఘుశ్రేష్ఠ నాతః కాంక్షే వరంప్రభో !**

తా॥ ఓ, మహా పురుషా! నాకు వరమనుగ్రహించగోరిన యెడల సీతాలక్ష్మణ సమేతుడవై శంఖ చక్ర ధనుర్బాణ ధారివై యిప్పటి నీ దివ్య మంగళ విగ్రహముతో నా శిరస్సున వశింపుము. నన్నెడబాయకుండుటే నా మనోభీప్సితము అని కోరెను.

శ్రీరామ చంద్ర ఉవాచ:

**శ్లో॥ వసామి శిఖరే భద్ర తవయావద్ధరిష్యసి**
**భూమిర్భూతాని కల్పాంతే మత్సాయుజ్య మవాప్స్యసి**
**ఇదానీమపి తదాత్మానం మమప్రోప్తోసిసువ్రత**
**త్వద్దర్శనాదయంలోకో ధూత పాపోభవిష్యతి**

అంత శ్రీరామ చంద్రుడు పలికెను.

తా॥ ఓయీ, భద్రా! ఈ పృధివ్యాది పంచ మహాభూతములున్నంత కాలము నేను నీ పర్వత శిఖరమున వశించి యుండెదను. బ్రహ్మ కల్పాంతమున నీవు నా సాయుజ్యమును పొందగలవు. ఇప్పుడు నీవు కూడా నా దేహముతో తాదాత్మ్యము పొంది యున్నావు. ఇక రాముడు రామ భద్రుడు వేరు కాదు. నాతో కూడా నిన్ను సందర్శించిన వారు సమస్త పాపముల నుండి విముక్తిపొంది సకల శుభములను పొందగలరు.

ఈ విధముగా భద్రుడు శ్రీరామచంద్ర మూర్తి ఒకరిలో ఒకరు మమేక్యమై వెలసిన క్షేత్రమే భద్రాద్రి, భద్రాచలము. ఈ క్షేత్రము నందు వెలసినది శ్రీరామ చంద్రమూర్తే తప్ప అన్యులు కాదు.

## <u>ఇది ప్రమాణ సహితం</u>

## <u>ఈ బ్రహ్మ పురాణాన్ని మించిన పురాణం ఈ సృష్టిలోనే లేదు.</u>

భద్రుని శిరస్సున వెలిసనది శ్రీ సీతాలక్ష్మణ సంయుత శ్రీరామ చంద్రస్వామి వారు చతుర్భుజాలతో శంఖ చక్ర ధనుర్బాణ ధారియై వెలసి యున్నారు. కావున **శ్రీరామచంద్రస్వామినే వరాయ** అని తెలపుటమే ప్రమాణం.

నేను గత మూడు సంవత్సరాలుగా శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు గారు వ్రాసిన గ్రంథం నుండి ఒక్కొక్క ప్రకరణం ఒక చిన్న పుస్తకంగా ప్రచురించి శ్రీ భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవంలో ఉచితంగా భక్తులకు అంద జేయుటం జరిగింది.

ఈ సంవత్సరం శ్రీ భద్రమహర్షి చరిత్రను ప్రచురించి భక్తులు కంద జేయవలసివుంది. కాని కారణాంతరల వల్ల సమయానికి అంటే శ్రీ రామ నవమి కల్యాణం సందర్భంగా అందజేయలేకపోయాను.

ప్రస్తుతం అవకాశం వచ్చింది కాబట్టి శ్రీ భద్ర మహర్షి చరిత్రను యిప్పుడు ప్రచురించి భక్తులకంద జేస్తున్నాను.

నేను ఈ ప్రచురణను ఎవరిపై కోపంతో గాని, కక్షతో కాని, విమర్శించాలని కాని, వారిని తప్పు పట్టడానికి గాని, ఆక్షేపించటానికి గాని ప్రచురించటం లేదు. వాస్తవాన్ని మాత్రమే తెలియజేస్తున్నాను. కాబట్టి వెంటనే కళ్యాణ ప్రవరలో శ్రీ రామచంద్రస్వామినే వరాయ అని మార్చ వల్సిందిగా కోరుతున్నాను.


ఈ సందర్భంగా నేను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనరు గార్కి, ఉన్నతాధికారులకు, శ్రీ భద్రాచల కార్యనిర్వహణాధికారి గారికి, పండితులకు, ప్రముఖులకు, పెద్దలకు, భక్తులకు, సమస్త ప్రజానీకానికి, దేవాలయ అర్చకులకు సవినయంగా సమర్పించునదేమనగా భద్రాద్రిలో వెలసినది శ్రీరామచంద్రమూర్తి తప్ప అన్యులు కాదని, భద్రాచల ప్రశస్తికి ప్రాదుర్భావానికి శ్రీ భద్ర మహర్షి మరియు శ్రీరామచంద్ర మూర్తి యిరువురే మూల పురుషులు కాబట్టి ఈ భద్రమహర్షి చరిత్రే భద్రాచలానికి పరమ ప్రమాణము కాబట్టి కల్యాణ ప్రవరలలో "శ్రీరామ చంద్రస్వామినే వరాయ" అనటమే పరమ ప్రమాణము.

భద్రాచల చరిత్రకు యితర శాస్త్రాలు గ్రంథాలు, పురాణాలు, ఆగమాలు, తాళపత్ర గ్రంథాలు ప్రమాణం కానే కావు. అవి అన్నీ నిరాధారములే. భద్రాచల చరిత్రకు వాటితో ఎట్టి సంబంధము లేదు.

ఈ విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సత్వర చర్య గైకొని భద్రాద్రి శ్రీరామ చంద్రునికి గత వైభవాన్ని, గౌరవాన్ని చేకూరుస్తారని ఆశిస్తూ ముగిస్తున్నాను.

**"ఇతి శ్రీరామచంద్రార్పణ మస్తు"**

సేకరణ కర్త
అమరవాది వైజయంతి మాల



# శ్రీభద్రాచలక్షేత్ర మహాత్మ్యము

(బ్రహ్మపురాణాంతర్గతము)



రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయః పతయే నమః

సూత ఉవాచ:

**శృణు శౌనకభూయోపి భక్తకల్పతరోర్హరేః**
**మహాత్మ్యం రామభద్రస్య భద్రాద్రిశిఖర స్థితేః**

సూతుడు చెప్పుచున్నాడు.

తా.ఓ! శౌనకా! వినుము. భక్తజనుల పాలిటి కల్పవృక్షమై శ్రీ భద్రాచల శిఖర మధ్యమందు వెలసియున్న శ్రీ సీతారామచంద్ర మహాప్రభువువారి దివ్యచరిత్రమును నీకు చెప్పుచున్నాను.

**యచ్ఛ్రుత్వా ఘోరసంసారా న్ముచ్యతే సర్వతోభయాత్**
**తదిదానీం తవాఖ్యాస్యే వేదేచ ప్రతిపాదితం**

తా. ఈ మహాత్మ్యమును వినినవారికి భయంకరమైన సంసార బాధలు సమస్త భయములును తొలగిపోవును. ఇది వేదమునందు కూడా ప్రతిపాదించ బడినది.

**మేరుదేవ్యా పురా మేరుర్భార్యయాసహితస్సుధీః**
**తపశ్చకారవై తీవ్రం బ్రహ్మణో వరకాంక్షయా**
**వాతవర్షాతపాదీనాం సహిష్ణు స్సోనిలాశనః**

తా. పూర్వకాలము ఒకప్పుడు మేరువను మహాత్ముడు పుత్రసంతాన వరము బడయగోరి భార్యసమేతుడై ఎండగాలివానలను లక్ష్యపెట్టక వాయు భక్షణ మాత్రము సల్పుచు ఘోర తపమొనర్చెను.

**తతః ప్రసన్నో భగవాన్ బ్రహ్మలోక పితామహః**
**ప్రాహ ప్రసన్నోస్మివరం తవ దాస్యామి కాంక్షితం**

తా. అంతట సర్వలోక పితామహుడు బ్రహ్మ ప్రసన్నుడై మేరుదంపతులకు సాక్షాత్కరించి "ఓ పుణ్యాత్ములారా! మీ తపమునకు సంతసించితివి, అభీష్ఠమును తెలుపుడు ఇచ్చెదను" అని పలికెను.

**పురస్థితంతు తం శ్రీఘ్రం దృష్ట్వా బ్రహ్మణ మబ్రవీత్**
**రామభక్త్యైకశరణం రామార్చనపరం సదా**
**కుల సంరక్షణార్థాయ దేహి పుత్ర మకల్మషం.**

తా. ఎదుట నిలిచియున్న బ్రహ్మదేవుని సందర్శించి వేగముగా మేరువు "స్వామి! శ్రీరామ భక్త పరాయణుడు శ్రీరామ పూజా ధురంధరుడు నిష్కళంక చరిత్రుడు అగు సత్పుత్రుని మాకు ప్రసాదింపుము" అని వేడుకొనెను.

బ్రహ్మోవాచ:

**యథాభిలషితో భూయాత్తవపుత్ర స్సురోత్తమ**
**ఇత్యుక్త్వాంతర్దధే బ్రహ్మా సోపిలబ్ధ్వాప్రియంసుతం**
**తతః కాలేన మహతా జాతః పుత్ర శ్శిలోచ్చయః**
**విఖ్యాతో భద్ర ఇత్యుచ్చై ర్భద్రాద్రి రితి మానవైః**

బ్రహ్మ యిట్లనెను:

తా. ఓ ! "సురశ్రేష్ఠా ! అట్లేయగుగాక" అని బ్రహ్మదేవుడు వరమిచ్చి యంతర్థాన మందెను. అనంతరము బహుకాలమున కామేరు దంపతులకు పర్వత శిరోభూషణమైన కుమారుడు జన్మించెను. ఇతడే మానవ లోకమున భద్రుడనియు భద్రాద్రియనియు మిగుల ప్రసిద్ధి బొందెను.

**పురా రామో దండకాయాం సంచరన్ పాదచారతః**
**తత్రైకస్మిన్ శిలాపృష్ఠే రామస్సీతాసమన్వితః**
**ఆశయిష్ఠతదాతస్మిన్ రామః ప్రీతి సమన్వితః**
**భవిష్యసి మహాత్మాత్వం భక్తోసి గిరిరూపధృత్**
**రామః ప్రోవాచతం మేరు తనయం ప్రీతమానసః**

తా. పూర్వము శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యమున పాదచారియై సంచరించుచు ఈ పర్వత శిలాతలముపై కొంత సేపు విశ్రాంతి గైకొనెను. అప్పుడీ మేరుపుత్రుడైన శైలరాజముపై ప్రీతిగలవాడై శ్రీరాముడు "ఓయీ ! గిరిరూపము ధరించియున్న నీవు నాకు పరమ భక్తుడవు మహాత్ముడవు కాగలవు" అని పలికెను.

**సఏవజాతో మేరోశ్చ మేరుదేవ్యాం శిలోచ్చయః**
**రామభద్ర పదాం కత్వాత్ భద్రాద్రి రితి విశ్రుతః**

తా. శ్రీరామభద్రుని పాదారవింద స్పర్శభాగ్యమునంది ఈ పర్వతశ్రేష్ఠము భద్రాద్రియని లోకమున ప్రసిద్ధికెక్కెను. మేరు దేవియందు మేరువునకు జన్మించిన ఆ పర్వతమే యీ భద్రాచలము.

**జాతస్మరోయం గిరిరాట్ రామధ్యానైకతత్పరః**
**తపవుగ్రం సమారేభే రామదర్శన లాలసః**

తా. శ్రీరామానుగ్రహముచే ఈ భద్రాద్రికి దివ్యజ్ఞానముదయించెను. అంత శ్రీరామ ధ్యానపరాయణుడై శ్రీరామచంద్రసందర్శనాభిలాషియై అతడు ఉగ్రమైన తపము నారంభించెను.

**భద్రస్య తపసాభూతో మహాగ్నిర్భువనత్రయం**
**భస్మీకర్తుం సముద్యుక్తస్తం వీక్ష్యతు పితామహః**
**మహేంద్ర ప్రముఖాదేవాః క్షీరసాంద్ర ముపేత్యతం**
**నారాయణం జగన్నాథ మనేకైర్వేదపాఠకైః**
**స్తుత్వాతు ప్రార్థయా మాసుః హేదేవ కరుణామయ**
**రక్షధ్వం త్రీణిలోకాని పావకాత్తపసోత్థితాత్**
**తవభక్తస్య భద్రస్య మహాత్మ్యం స్వామి రాశుగాత్**

తా. భద్రుని తపశ్శక్తి నుండి పుట్టిన మహాగ్ని ముల్లోకములను భస్మీభూతము జేయ సమకట్టెను. అప్పుడు మహేంద్రప్రముఖులగు దేవతలు పితామహుడు క్షీరసముద్రము జేరి జగన్నాథుడగు శ్రీమన్నారాయణుని వివిధ వేదపాఠములతో స్తోత్ర మొనర్చి "ఓ దేవ దేవా! కరుణామయా! నీభక్తుడగు

భద్రుని తపస్సంభూతమమైన మహాతేజము నుండి యీ త్రిభువనములను శీఘ్రముగా సంరక్షింపుము అని ప్రార్థించిరి.

**ఇతి సంస్తువతో దృష్ట్వా వైకుంఠోభక్తపాలకః**
**వాయు వేగేన పర్యంకం పరిత్యజ్యచ ఆయుధాన్**
**సవ్యాపసవ్య రూపేణ ధృత్వా శ్రీరామ వచ్ఛభం**
**సుందరం రూపమాసాద్య సీతాలక్ష్మణ సంయుతః**
**వియద్గమున మార్గేణ భద్రాద్రిం ప్రాప్య సుందరం**
**అనేక వర్షసాహాస్రం తతః శ్రీతోరఘూత్తమః**
**తపస్వినంతుతం దృష్ట్వా తతః ప్రీతో రఘూత్తమః**
**వరం వృణీష్వభద్రంతే తపసాతే స్మితోషితః**

తా. ఇట్లు దేవతల విన్నపము లాలకించి భక్తలోక పరిపాలకుడగు శ్రీమన్నారాయణుడు వాయు వేగమున శేష పర్యంకము విడిచి పంచాయుధములను పరిగ్రహింపక సుదర్శన పాంచ జన్యములను సవ్యాపసవ్యములుగా– దక్షిణహస్తమున శంఖమును వామహాస్తమున చక్రమును బూని శ్రీలక్ష్మి సీతయై శేషాహిలక్ష్మణుడై తన ననుగమింప అతిసుందరమగు శ్రీరామచంద్ర రూపము ధరించినవాడై ఆకాశ మార్గముగా బయలు దేరి రమణీయమైన భద్రశైలమం దావిర్భవించి తపస్వియగు భద్రునిమోల సాక్షాత్కరించి యాతని దీక్షగాంచి మహదానంద రసపరిపూర్ణుడై "ఓ ! భద్రా! నీకు భద్రమగుగాక! నీ తపస్సుకు మెచ్చితిని, వరము ప్రసాదించెదను, అభీష్టము కోరు కొనుము" అని పలికెను.

**శృత్వాతు రామభద్రస్య గంభీరం సఫలం వచః**
**ఉన్మీల్య సహసా నేత్రే రామం దృష్ట్వాతి విస్మితః**

*తా. భద్రుడు శ్రీరాముని గంభీరము ఫలవంతము అగు వాక్కు నాలకించి వెంటనే కన్నులు తెరిచి శ్రీరామచంద్ర మహాప్రభువు యొక్క దివ్యమంగళ విగ్రహ సందర్శన మొనర్చి మహాశ్చర్య భరితుడయ్యెను.*

**అనేక సూర్యసంకాశ ప్రభయాచ దిశోదశ**
**ప్రకాశయంతం జానక్యా వామాంకోపరిశోభితం**
**శంఖచక్రధనుర్బాణధరం పీతాంబరవృతం**
**దివ్యకల్పవిచిత్రాంగం వైజయంత్యాచ మాలయా**
**ధను ర్ద్వంద్వకరేణాధ లక్ష్మణే నోపశోభితం**
**వైకుంఠవాసిభి స్సర్వైః పార్షదై రుపశోభితం**
**దృష్ట్వా తం భయహర్షాభ్యాం చకంపే పులకాంకితః**
**స్రుతానందాశ్రునేత్రాంతః పపాత భువిదండవత్**
**ప్రసీద దేవనాథేతి ననామచ సహస్రశః**
**ఉత్థాయోత్థాయభక్త్యా తం దృష్ట్వా రామం పురఃస్థితం**
**వాచా గద్గదయా స్తోతుం భద్రాద్రి రుపచక్రమే.**

తా. అనేక సూర్యకాంతులతో దశదిశలు వెలుగొందుచుండ శ్రీ జానకీదేవి, శ్రీరామ చంద్ర మహాప్రభువు వామాంకమందధివసించి యుండెను. స్వామి చదుర్భుజుడై శంఖచక్ర ధనుర్బాణధారియై పీతాంబర సుశోభితుడై దివ్యచందన చర్చలు వైజయంతీ ప్రసూనమాలికలు దాల్చి వీరాసనాధిష్ఠితుడుగా మహోజ్వలుడై ప్రకాశించుచుండెను. ద్విభుజుడై లక్ష్మణుడు వామపార్శ్వమును ధనుర్బాణములు

దాల్చి జాగరూకుడై యుండెను. విష్వక్సేనాది వైకుంఠ పార్షద ముఖ్యులు శ్రేషీభూతులై సేవించుచుండిరి.

ఈమహాద్భుత దృశ్యముగాంచి భద్రుని మేను పులకించెను. ఒడలు కంపించెను. ఆనందాశ్రువులు స్రవించెను. తక్షణమే భూమిపైబడి యనేక సాష్టాంగ దండ ప్రణామము లాచరించుచు “హే ప్రభో! శ్రీరామచంద్రమూర్తి! సీతా మనోహరా! లక్ష్మణాగ్రజా! దేవాధిదేవా! శరణు శరణు, అనుగ్రహింపుము అనుగ్రహింపుము’’ అని భద్రుడు గద్గదకంఠముతో శ్రీరామభద్రుని పలుమారుస్తుతించెను.

## శ్రీరామస్తవః

భద్రాద్రి రువాచః

**నమస్తే దేవదేవేశ శంఖచక్రగదాధర**
**ధనుర్బాణధరానంత రామచంద్రనమోస్తుతే**

భద్రుడు పలికెను.

తా. ఓ ! దేవదేవా! నీకు నమస్కారము శంఖచక్రగదాధరా! ధనుర్బాణధరా! అనంతా! రామచంద్రా! నీకు నమస్కారము.

**వైకుంఠవాసిభి ర్దృశ్య చరణాంబుజసత్తమ**
**కథం మమాద్యదృష్టస్త్వం జడబుద్దేర్దృషదాకృతేః**

తా. ఓ ప్రభూ ! వైకుంఠవాసులగు మహనీయులచే మాత్రమే సందర్శింపబడు పాదపద్మములు గల నీవు జడబుద్దియు పాషాణస్వరూపముగల నాకెట్లు సాక్షాత్కరించితివి.

**నమ స్త్రైలోక్యధామ్నేతే స్వచ్ఛధామ్నే పరాత్మనే**
**ఆత్మారామాయరామాయ సీతారామాయ వేధసే.**

తా. ఓ త్రిభువనాధార భూతా! అప్రాకృత దివ్యమంగళ విగ్రహా! అంతర్యామి రూపా! పరబ్రహ్మ రూపా ! ఆత్మారామా ! రామా! సీతారామా! నీకు నమస్కారము.

**జగదుత్పత్తినాశానాం కారణాకారణాత్మనే**
**అచింత్య శక్తయేనంత మూర్తయే బ్రహ్మణే నమః**

తా. జగదుత్పత్తి స్థితినాశములకు కారణమైన వాడవు కాని వాడవు నగు నోదేవా! అచింత్యాద్భుతశక్తి స్వరూపా! అనంతావతారా! పరబ్రహ్మరూపా! నీకు నమస్కారము.

**జయజయ రఘువంశోత్తంస కంసాది రక్షో**
**ద్విపకుల మదహారిన్ రావణారే మురారే**
**అగణిత గుణధామన్ నిర్గుణావ్యక్తమూర్తే**
**భవభయహర విష్ణోత్వాం శరణ్యం నతోస్మి.**

తా. ఓ రఘువంశశిరోవతంసమా! జయముజయము, కంసాది దుష్టదానవ గజమదాపహారీ! రావణారీ! మురారీ! అనంతగుణగణాగ్రణీ! నిరాకారరూపా! అవ్యక్తమూర్తీ! భవభయహరా! శ్రీవిష్ణుదేవా! నిన్నే శరణంటిని. నన్ను రక్షింపుము.

**అపరిమిత భవాబ్దేస్తారణాయ ప్లవస్త్వం**
**త్రిజగదుదయరక్షా నాశహేతుస్త్వమేకః**
**సదసదఖిలవిశ్వం త్వన్నియంతృప్రధానం**
**రవిశశిశిఖినేత్రః కేన శక్యోసి గంతుం.**

తా. అంతులేని సంసారసముద్రము దాటించు నావవు నీవు. మూడు లోకములు పుట్టి పెరిగి విరుగుటకు నీవే నిజమైన కారణము. నీవు సదసద్విశిష్ట చరాచర జగత్తుకు నియంతవై నడుపుచున్నావు. సూర్యచంద్రాగ్నులు నీనేత్రములు. అట్టి నిన్ను తెలిసికొన నెవ్వరికి శక్తి కల్గును.

**రఘువర తవ మాయోల్లాస జై స్తామసాది**
**త్రిగుణమయ దురాశాపాశ జాలైర్నిబద్ధః**
**అహమిహ గురుయోగిధ్యాన దుర్లక్ష్యతత్వం**
**తవచరణ విభావం జ్ఞాతుకామోతిగూఢం.**

తా. ఓ శ్రీరామచంద్రా! నీ మాయచే సృజింపబడిన సత్వరజస్త మోగుణాత్మక మైన మాయాపాశములచే బంధింపబడియున్నాను. అట్టి నేను మహాయోగిజన దుర్లభము పరమరహస్యమైన నీ చరణార విందప్రభావమును తెలియగోరుచున్నాను.

**ధనజన సుతయోషిత్సంగదుస్సంగ మత్తో**
**హ్యహమిహతవ తత్త్వం జ్ఞాతుకామో యదిస్యాం**
**అనిల సలిల మాత్రాహారభాజాం మునీనాం**
**అనవరత కృశానాం వ్యర్థ ఏషప్రయాసః**

తా. ధనధాన్యములు సుతసేవకగణములు సుందరయువతీ జన సాంగత్యములు దుస్సహవాసములతో బాగుగా మదించి యున్న నాబోటులే నీ భగవతత్త్వ ప్రభావములను తెలిసికొనజాలినయెడల గాలినీరు మాత్రమే భుజించుచు కఠినతర నిష్ఠలలో నిమగ్నులై తపఃకృశాంగులై యుండు మహామునుల తపోయోగ ప్రయాసలు దండుగలే యగును గదా.

**యది నిజహృదికృత్యం జానతే లోకతత్త్వం**
**విషయవిషనిపీయన్ సన్నిపాతాభిభూతాః**
**అహమతి తవతత్త్వం జ్ఞాతుకామో తథాస్యాం**
**విషయగుణగణాద్యై ర్వ్యాప్తసం మోహదోషః**

తా. సంసార సుఖములను విషద్రవములను పానముజేసి సన్నిపాతజ్వరా విష్టులవలె నుండు సామాన్య లౌకిక జనులు తమ హృదయములలో లోకతత్త్వమును సరిగా నెరుంగజాలునెడల శబ్దాది విషయ గుణగణ సంమోహితుడనై దోషశీలినైన నేనుగూడ సృష్టిస్థితిలయకారణమగు నీ ఈశ్వరతత్త్వమును గ్రహింపగల్గుదును.

**తదపి మమ మనస్స్యాం దిర్గుణం నిర్వికారం**
**విషయ విహితబుద్ధిజ్ఞాన మానంద సాంద్రం**
**అనుదినమను గంతుం రామ యత్నం కరోతి**
**ప్రబలతర సముద్రం లంఘితుం కీటవత్తత్.**

తా. ఓ శ్రీరామచంద్రా! విషయదుర్వాసనా వ్యామోహితమైన నా మనస్సు ప్రబలతర సముద్రమును లంఘించుటకు ప్రయత్నించు కీటకమువలె నిర్గుణము నిర్వికారము చిదానంద ఘనమునగు నీ పరంజ్యోతి స్వరూపమును పొందుటకు అనుదినము ప్రయత్నశీలమగుచున్నది.

**జిత్వాంతరస్థపవమాన చయం గుణాంశ్చ**
**చేతస్సమాధి నిరతం నితరాం హృదబ్జే**
**సంసేవయన్ దశ యమాన్ నియమాన్మునీంద్రః**
**కశ్చిద్విరాగ సహితస్తవవేత్తి తత్త్వం.**

తా. ప్రాణపానవ్యానోదాన సమాన ప్రాణవాయు పంచక సంచారముల నిరోధించి జితేంద్రియులై యమనియామాసన ప్రాణాయామ ప్రత్యాహారధారణ ధ్యాన సమాధినియమ నిష్ఠులగుచు హృదయ పుండరీకముల పరమాత్మను నిలిపి యుపాసించు పరమయోగీంద్ర జన బృందములలో నే యొక్క విరాగియోగాని అన్యులు నీ తత్త్వమును సరిగా గ్రహింపజాలరు.

**అహంజడోత్యంత వినష్టచేతాః**
**పాషాణ మాత్రైన రసాది హీనః**
**యధాసతీం గౌతమ ధర్మపత్నీం**
**స్పృష్ట్వాపదామాం ప్రపునీ హితద్వత్.**

తా. నేను శుద్ధ మూర్ఖుడను, బుద్ధిహీనుడను, రసహీన పాషాణ స్వరూపుడను. కావున నో ప్రభూ గౌతమ ధర్మపత్నియగు అహల్యను నీ పాదారావింద స్పర్శచే పావన మొనర్చినట్లు నీ చరణ పంకజములను నా శిరముపై నిడి నన్నును పవిత్రుని జేయుము.

**ఆధివ్యాధి మహాహిసంఘ శరణే తృష్ణార్ణవే భీకరే**
**కామక్రోథమదాద్యమిత్ర నివహే మోహాంధకారే శుచౌ**
**మాత్రా బృదంగజాకులే విలుఠితస్సీతాపతే దేహిమే**
**త్వద్భక్తిం భవకాననే ఖలు సతామార్తార్తినాశాగుణాః**

తా.   ఓ సీతాపతీ వ్యాధులు, మనోవ్యధలను ఘోరసర్పములు చుట్టుకొనినవి. ఆశయను మహాసముద్రము భీకరముగా పొంగినది. కామక్రోధ మదమాత్సర్యములను శత్రువులు పీడించు చున్నారు. అజ్ఞానాంధకారము అలుముకొనినది.  శబ్దస్పర్శరూప రస గంధములను మద గజములు తరుముచున్నవి. ఈ సంసార భయంకరారణ్యములో చిక్కుకొనినాను. ఓ దేవా నీ పరాభక్తిని నాకు ప్రసాదించి, నన్ననుగ్రహింపుము. సత్పురుషులు దీనజనరక్షణ దీక్షాకంకణ ధారులు గదా.

*సూత ఉవాచ:*

**తతః ప్రసన్నో భగవాన్ రాఘవః కరుణాకరః**
**ఉవాచ కరుణాపాంగ వీక్షితామృత వృష్టిభిః**
**స్నాపయన్నితరాం శుభ్రం దంత చంద్రిక యాగిరం**
**వరదోహం వరదరాట్ వరం వరయ సువ్రత**
**దాస్యామి తపసాతుష్టసోత్రేణ చ విశేషతః**

సూతుడు చెప్పుచున్నాడు:

తా. ఇట్లు ప్రార్థింపగా కరుణాసముద్రుడగు శ్రీరామచంద్రుడు ప్రేమవీక్షణములతో భద్రునిపై అమృతము వర్షించుచు దంత చంద్రికలతో వాక్కుల నభిషేకించుచు "ఓ భద్రా పుణ్యాత్ముడా నేను వరము లిచ్చువాడను. ఇంకను వరము లిచ్చువారికి రాజాధిరాజును. నీ తపస్సునకు స్తోత్రమునకు మెచ్చితిని. కావలసిన వరములను కోరుకొనుము. ఇచ్చుచున్నాను " అని పలికెను.

*భద్రాద్రి ఉవాచ:*

**కథం కాంక్ష్యామి దేవేశ త్వమేకం నీచకాంక్షితం**
**యథాపృచ్ఛతివై ఏకం ఫలం ప్రాప్యతు కల్పకం**
**తథాపి తవ ఆజ్ఞామే ఉల్లంఘితు మనర్హతి**
**తస్మాత్కాంక్ష్యామి హేదేవ మమకాంక్షిత మద్యతం.**

భద్రుడు పలికెను :

తా. ఓ శ్రీరామచంద్ర వరదరాజప్రభో నీవంటి మహాపురుషుని మ్రోల నొక నీచ కాంక్షిత మెట్లభిలషింతును. కల్పవృక్షము నీడ కనుగాయ కోరదగునా? అయినను నీ యాజ్ఞ యనుల్లంఘనీయము గావున నా వాంఛితము తెలుపు కొనుచున్నాను.

**యదిదాస్యసి మేదేవ వరం వరద సత్తమ**
**అనేన మే ప్రసన్నేన రూపేణ మమ మూర్ధని**
**శంఖచక్ర ధనుర్బాణ సీతాలక్ష్మణ సంయుతః**
**నివసత్వం రఘుశ్రేష్ఠ నాతః కాంక్షేవరం ప్రభో.**

తా. ఓ మహాపురుషా! నాకు వరమే యనుగ్రహింపగోరిన యెడల సీతాలక్ష్మణ సమేతుడై శంఖచక్రధనుర్బాణధారివై ఇప్పటి నీ దివ్యమంగళ విగ్రహముతో నా శిరస్సున నివసింపుము. నీవు నన్నెడబాయకుండుటయే నా మనోభీప్సితము.

**శ్రీరామచంద్ర ఉవాచ:**

**వసామి శిఖరే భద్ర తవయావద్ధరిష్యతి**
**భూమిర్భూతాని కల్పాంతే మత్సాయుజ్య మవాప్స్యసి**
**ఇదానీ మపి తాదాత్మ్య మను ప్రాప్తోసి సువ్రత**
**త్వద్దర్శనా దయం లోకో ధూతపాపో భవిష్యతి.**

**శ్రీరామచంద్రుడు పలికెను :**

తా. ఓయీభద్రా! ఈ పృథివ్యాధి పంచమహా భూతములుండునంత కాలము నీ పర్వతశిఖరమున నేను నివసించి యుండెదను. బ్రహ్మకల్పాంతమున నీవు నా సాయుజ్యమును పొందగలవు. ఇప్పుడు కూడా నీవు నా దేహముతో తాదాత్మ్యము పొందియున్నావు. భద్రుడు రామభద్రుడు ఇకవేరు గాదు. నాతో గూడిన నిన్ను సందర్శించిన వారు సమస్త పాపముల నుండి విముక్తి బొంది సకల శుభములను పొందగలరు.

**గౌతమేనాహృతాగంగా గౌతమ్యాఖ్యా స్తి మత్పురః**
**త్వత్పాద దర్శనాదేవ పావయిష్యతి వైజగత్.**

తా. గౌతమ మహర్షిచే కొనిరాబడిన గంగ గౌతమియను నామము దాల్చి నా యెదుట నీ పర్వతపాదములను స్పృశించి ప్రవహించుచున్నది. ఈ భద్రగిరి దర్శనముచే సమస్త జగత్తు పావనమగును.

**త్వాం మయాసహితం లోకాః ప్రదక్షిణ మతంద్రితాః**
**త్రిఃకుర్వంతి దినేభానౌ తేయాంతి మమ విష్టపం.**

*తా. ఆదివారము నాడు నాతో గూడియున్న నీ భద్ర శైలమును యే మనుజులు ముమ్మారు ప్రదక్షిణము లొనర్తురో వారు నావైకుంఠ లోకమును జేరగలరు.*

**సీతారామవ్రతం కుర్యా దత్రయస్తు మమప్రియం**
**అగస్త్యేన పురాప్రోక్తం సుతీక్ష్ణాయ పురాతనం**
**సోత్రభుక్త్వాఖిలాన్ భోగానంతే మత్సామ్య మాప్నుయాత్.**

తా. ఎవ్వరు భద్రాచలమున నాకు ప్రియమైనట్టియు, పూర్వము ఆగస్త్యునిచే సుతీక్ష్ణునికుపదేశింపబడినట్టియు శ్రీ సీతారామవ్రతమును భక్తియుక్తులై యాచరింతురో వారు ఇహలోకమునందు సమస్త సౌఖ్యముల ననుభవించి యంత్యకాలమున నా సాయుజ్యమును జెందగలరు.

**ఇత్యా మంత్ర్యగిరిం రామస్తస్యై శిఖరేవసత్**
**శంఖచక్ర ధనుర్బాణ జానకీసహితః ప్రభుః**
**వైకుంఠవత్సదా తస్మిన్ వైకుంఠపురవాసిభిః**
**సహిత స్సర్వలోకానాం కామితార్థ ప్రసిద్ధ యే**
**తదాది సర్వలోకానాం పూజ్యోభూద్గిరిసత్తమః**
**తాదాత్మ్యా ద్రామభద్రస్య రామేవా భవద్గిరిః**

తా. అని యీ ప్రకారము ప్రభువు శ్రీరామచంద్ర మూర్తి భద్రునికి వరము లొసంగి ధనుర్బాణశోభితుడై సీతాలక్ష్మణ సమేతుడై వైకుంఠవాసులతో పరమపదమున వేంచేసియున్నట్లు జగత్కల్యాణసంధాయకుడై భద్రశైలశిఖర మధ్య ప్రదేశమున శిలారూపము గైకొని యావిర్భవించెను. నాడు మొదలు నేటి వరకు ఈ పర్వతరాజము రామ భద్రునితో నైక్యము జెందినందున భద్రుడే

రాముడు, రాముడే భద్రుడుగా శ్రీ భద్రాద్రిరామ స్వరూపమై సర్వలోకవాసులకు సంపూజనీయమయ్యెను.

**స్నానం దానం తపోయజ్ఞాః బ్రహ్మ సంతర్పణాదికం**
**యద్యత్కరోతి భద్రాద్రౌ తత్తత్కోటి గుణం భవేత్.**

*తా. భద్రాద్రియందు చేయబడిన స్నానము దానము జపము యజ్ఞము బ్రాహ్మణ సంతర్పణము మొదలగు ధర్మకార్యములన్నియు కోటిరెట్లు అధికఫల మొసంగును.*

**అన్యత్ర బ్రాహ్మణానాంతు కోటిం సంభోజ్య యత్నతః**
**వారాణస్యా మిహైకేన భోజ్య మాకేన తత్ఫలం**
**కాశ్యాం ద్విజానాం సాహస్రం భోజయిత్వాతు యత్ఫలం**
**తత్ఫలం భద్రశిఖరే ద్విజస్యైకస్య భోజనాత్.**

తా. ఇతర క్షేత్రములలో కోటిమంది బ్రాహ్మణులకు అన్నదానము జేసిన గల్గు పుణ్య ఫలము కాశిలో ఒక్క బ్రాహ్మణునికి భోజనము పెట్టుట వలన గల్గును. అట్టి కాశిలో వెయ్యిమంది బ్రాహ్మణులకు అన్నదానము గావించిన ఎట్టి పుణ్య ఫలము ప్రాప్తించునో అంత పుణ్య ఫలితము భద్రాచల క్షేత్రమున ఒక్క బ్రాహ్మణునికి అన్నము పెట్టినచో సమానమగును. ఇతర క్షేత్రములు కంటే కాశి యొక్క ప్రభావం కోటిరెట్లు గొప్పది. శ్రీ భద్రాచాల క్షేత్ర మహాత్మ్యము కాశికంటే సమస్రగుణములు అధికము.

**యః పూజయతి శ్రీరామం నక్షత్రేతు పునర్వసౌ**
**తస్య సర్వాని సౌఖ్యాని దీయతే రఘుసత్తమః**

తా. శ్రీరామచంద్రుని జన్మనక్షత్రమగు పునర్వసునందు ఎవ్వరు భద్రాచల రాముని పూజింతిరో, వారికి సర్వ సౌఖ్యములను రఘునందనుడు ప్రసాదించును.

**ఏకాదశ్యాంతు భద్రాద్రౌ ఉపవాసం కరోతి యః**
**జాగరం కురుతే రాత్రౌ సో గచ్ఛతి పరంపదం**

తా. ఏకాదశి తిథియందు శ్రీ భద్రాచల క్షేత్రమున ఉపవాస మొనరించి, భగవన్నామ సంకీర్తన పరులై రాత్రి జాగరణ మొనర్చినవారు శ్రీ వైకుంఠ లోకమును చేరుదురు.

**భృగువాసర రాత్రౌ యే జానకీం పూజయంతితే**
**ఇహ సర్వసుఖాన్ భుక్త్వాచాంతే సాయుజ్య మాప్నుయాత్.**

తా. శుక్రవారమునాటి రాత్రి యెవ్వరు శ్రీ సీతాదేవి పూజనము, ఈ క్షేత్రమున సల్పుదురో వారీ లోకమున సర్వ సుఖములను అనుభవించి, యంత్యమున మోక్షమును పొందగలరు.

**కల్యాణ గుణ సంపూర్ణం భక్తాభీష్ట ప్రదాయకం**
**రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే**

తా. కల్యాణగుణ గణ పరిపూర్ణుడగు భక్తాభీష్ట ఫలప్రదాత యగు శ్రీభద్రాచల రామచంద్ర స్వామిని రథ మధ్యమందు ఎవ్వరు సేవించుకొందురో అట్టి భక్తులకు పునర్జన్మ రాహిత్యము కల్గును.

**సంప్రాప్యరామ నవమీం తులసీదళాద్యైః**
**సంపూజ్యభద్రగిరివాసిన మాదిదేవం**
**కృత్వోపవాస మథజాగరణం చమర్త్యః**
**సాక్షాత్పదం రఘుపతేః పరమం ప్రయాతి.**

తా. ఎవ్వరు శ్రీరామనవమి పవిత్రదివసమందు శ్రీ భద్రాచల క్షేత్ర నిలయుడగు ఆదిదేవుడగు శ్రీరామచంద్ర పరబ్రహ్మమును తులసీదళ పుష్పోపహారాధి పూజా ద్రవ్యములతో నర్చించి యుపవాసమొనర్చి, రాత్రివేళ శ్రీరామనామ సంకీర్తనములతో జాగరణమొనర్తురో అట్టి మహనీయులు దేహావసానమున శ్రీరామ చంద్రమూర్తి దివ్యానుగ్రహమున తప్పక పరమపద ప్రాప్తినందెదరు.

**యస్తురామనవమీ దినేహరిం**
**భద్రతీర్థ నిలయం సమీక్షితుం**
**గచ్ఛతి ప్రముదితః ప్రతివత్సరం**
**సోశ్వమేధ ఫలమక్షయం లభేత్.**

తా. ఏ పుణ్యాత్ములు ప్రతి సంవత్సరము సంతోషముతో శ్రీరామనవమీ మహోత్సవము కొఱకు శ్రీ భద్రాచలక్షేత్రమునకు యాత్రలు చేయుదురో అట్టివారు అక్షయమైన అశ్వమేధయాగఫలమును పొందగలరు.

**బ్రహ్మావా సురాపీవాస్తేయీ చ గురుతల్పగః**
**భద్రాద్రినిలయం రామం నత్వాపాపైః ప్రముచ్యతే**

తా. బ్రహ్మహత్య, సురాపానము స్వర్ణస్తేయము గురుపత్నీ గమనము మొదలగు మహాపాపకార్యములను జేసిన వారైనను శ్రీ భద్రాచల రామచంద్రమూర్తిని సందర్శించి నమస్కరించి యారాధనలు గావించిన ఎడల అట్టి మహాపాతక దోషములనుండి తప్పక విముక్తులు గాగలరు.

**యస్తు తత్ర త్యజే త్ప్రాణాన్ భద్రాచలసమీపతః**
**తస్యరామ స్స్వయంసాక్షాత్స్వరూపం దిశత్యజః**

తా. శ్రీ భద్రాచలక్షేత్ర సమీపమందు ఎవ్వరు మృత్యువు నందుదురో వారికి శ్రీరామ ప్రభువు పరమపదమున శంఖచక్రాది చతుర్భుజములతో గూడిన వైకుంఠపార్షదుల దివ్య స్వరూపములను ప్రసాదించును. కాశిలో మృతులగువారికి శ్రీ విశ్వనాథుడు కర్ణమూలమున రామతారక మంత్రో పదేశ మొనర్చి మోక్షమునకు సహాయపడుచుండును. ఈ భద్రాద్రిలోతారకమంత్రమూర్తి శ్రీ రామభద్రుడే స్వయముగా మృతులకు సాక్షాత్కరించి తన దివ్య స్వరూపము నొసంగి మోక్షము ననుగ్రహించు చుండును.

**పౌర్ణమాస్యాంకృతస్నాతాః శ్రీరామం పూజయంతియే**
**క్షేత్ర సర్వసుఖాన్ భూక్త్వా వైకుంఠ ప్రాప్నువంత**

తా. పౌర్ణమి పర్వము రోజున యెవ్వరు గౌతమీ స్నానము చేసి శ్రీరామచంద్రుని పూజలు చేయుదురో వారు ఇహలోకమున సర్వ సౌఖ్యముల ననుభవించి పరమున వైకుంఠపద ప్రాప్తులగుదురు.

**శ్రీమద్భద్ర శిలోచ్ఛయస్య పరితః క్రోశద్వయాభ్యంతరే**
**తీర్థాణ్యర్బుద సంఖ్య యాత్రిజగతాం సారాణి రామాజ్ఞయా**
**నిత్యం సన్నిహితాని సంతి నితరాం గోదావరీ పార్శ్వయోః**
**తస్మాదత్ర దినత్రయం వసతియః ప్రాప్నోతి విష్ణోఃపదం.**

తా. శ్రీ భద్రగిరి క్షేత్రమున గోదావరికి రెండు ప్రక్కల రెండు క్రోసుల పర్యంతముగల భూభాగమధ్యమందు శ్రీ రామాజ్ఞచే మూడు లోకముల యందలి ముఖ్య పుణ్య తీర్థములన్నియు అర్బుదముల సంఖ్యలో నిత్యము సాన్నిధ్యము వహించు చుండును. కావున అట్టి యీ మహాక్షేత్రమున ఎవ్వరైనను మూడు దినములు భక్తి భావముతో నివాసము జేసిన మాత్రముననే విశుద్ధాత్ములై శ్రీ విష్ణులోకమును పొందగలరు.

**గోదానం స్వర్ణదానంచ భూదానంచ కరోతి**
**సన్నిధౌ రామభద్రస్య సోయాతి పరమంపదం**

తా. గోదానము, స్వర్ణదానము, భూదానము మొదలగు దాన కర్మములను ఎవ్వరు శ్రీ భద్రాచల క్షేత్రమున శ్రీ రామసన్నిధిలో జేయుదురో వారును గొప్ప పుణ్యలోకములను గాంచగలరు.

**సాలగ్రామ మహాదానం యఃకరోతి మహాస్థలే**
**భద్రాద్రౌ తస్య వైపితౄన్ శ్రీఘ్రం దేవత్వ మావహేత్**

తా. ఈ భద్రాద్రి మహాస్థలమందు ఎవ్వరు సాలగ్రామమును మహాదానము గావింతురో వారి పితృదేవతలకు వెంటనే విముక్తి గల్గి దేవలోక ప్రాప్తి సంభవించును.

**ఏవముక్త్వాత్మజం బ్రహ్మా నారదం భగవత్ప్రియం**
**జగామభువనం సోపి నారదః ప్రాయశోభుని**
**ఆవ సద్రాఘువక్షేత్రే రామదర్శన లాలసః**
**గాయన్ శ్రీరామ నామాని బోధయన్ శ్రవణార్థినః**
**అటన్నపి జగత్కృత్స్నం ప్రాయో భద్రాచల స్థితః**

తా. ఇట్లు శ్రీ భద్రాచలక్షేత్ర మహాత్మ్యమును పూర్వము బ్రహ్మదేవుడు తన సుతుడగు నారదమహర్షికి తెలిపెను. ఇది విని నారదుడు భూలోకమునకు జేరి తన దివ్యసంచారములలో తరుచుగా రాఘవక్షేత్రమగు భద్రాచలమందు రామసందర్శనానంద పరవశుడై నివసించెను. శ్రీరామనామములను శ్రావ్యముగా గాన మొనర్చెను భక్తజనులకు వానిని బోధించెను. లోకపరిభ్రమణ మొనర్చు చున్నను ఆ ఋషి ఈ భద్రాచలమందే యెక్కువగా నివసించెను. ఇట్లు శ్రీభద్రాద్రి భగవన్నామ సంకీర్తన క్షేత్రమై వెలసెను.

**ఏవం ప్రభావం తత్తీర్థం సంక్షేపాత్కథితం మయా**
**నశక్యతే విస్తరతో వక్తుం దశశతై రపి.**

తా. ఓ శౌనకా ! ఇట్లు శ్రీ భద్రాచలక్షేత్ర మహాత్మ్యమును శ్రీ గౌతమీ తీర్థ ప్రభావమును నేను సంగ్రహముగా వచింతిని. దీనిని సంపూర్ణముగా వివరించుటకు నావంటి వేయిమందికైనను తరము గాదు.

**పశ్చిమాభిముఖో యత్రరామస్తిష్ఠతి సానుజః**
**శంఖచక్రక్రధనుర్బాణధర స్సీతాసమన్వితః**
**యత్ర గోదావరీపుణ్యా దక్షిణాభిముఖీ శుభా**
**యత్ర భద్రాచలే రామసేవా నిష్కల్మషాంతరః**
**తత్రైవ ముక్తిస్సులభా కలౌ నాన్యత్ర శౌనక.**

తా. ఎచ్చట శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణసహితుడై శంఖ చక్ర ధనుర్బాణధారియై పశ్చిమాభిముఖముగా వేంచేసియుండునో ఎచ్చట స్వచ్ఛ జలపరపూర్ణయగు గౌతమీ పుణ్యనది గోదావరీ గంగా తరంగిణి దక్షిణాభిముఖియై ప్రవహించుచుండునో అట్టి శ్రీ భద్రాచల క్షేత్రమందు నిష్కల్మషచిత్తులై శ్రీరామచంద్ర

సేవాకైంకర్యపరులగువారు తప్పక ముక్తి కాంతాపరిష్వంగసౌఖ్య మనుభవించగలరు. ఈ భద్రాచలక్షేత్ర మందు మోక్షము సులభముగా లభించునట్లు ఈ కలియుగమున నితరస్థలముల యందు ముక్తి సులభముగా లభింపదు. ఇట్లు ఇది గొప్ప ముక్తి క్షేత్రముగా విలసిల్లు చుండును.

**యస్తు ప్రదక్షిణం కుర్యాద్భానువారేచలోత్తమం**
**భూప్రదక్షిణతః పుణ్యం ప్రాప్నోతి సనరోత్తమః**

తా. ఆదివారమునాడు భద్రశైలమునకు భక్తితో ప్రదక్షిణములు జేయు పుణ్యాత్ములకు భూప్రదక్షిణముల ఫలము లభించును. సౌఖ్యముల ననుభవించి పరమున వైకుంఠపద ప్రాప్తులగుదురు.

**స్నాత్వాప్రాత స్సుబోధే దినకరదివసే గౌతమస్యాఘనాశే.**
**ధ్యాత్వా సీతాసమేతం హృదిరఘుతిలకం భద్రమద్రింప్రణమ్య.**
**గత్వా సంపూజ్య రామం గిరివర శిఖరే సీతయా సన్నివిష్టం**
**భుక్త్వా భోగా నభీష్టా నమరవరసుఖం ముక్తిమంతే ప్రయాతి.**

తా. ఎవ్వరు ఆదివారమునాడు ప్రాతఃకాల సూర్యోదయ శుభ సమయందు సకల పాపహారియగు గౌతమీ పుణ్య జలమునందు స్నానమొనర్చి యీ భద్రగిరికి మ్రొక్కి హృదయ పద్మమందు శ్రీరామ చంద్రమూర్తిని ధ్యానించి పర్వత మధిరోహించి గిరివరశిఖరాలయ మధ్యమందు వేంచేసియున్న సీతాసమేతుడగు శ్రీరామచంద్ర మహాప్రభువును పూజింతురో అట్టివారు ఈ లోకమున తాము కోరిన సకల వరమెల్ల బొంది యమరసుఖముల ననుభవించి స్వర్గ సౌఖ్యానంతరము తుదకు మోక్షసామ్రాజ్యపీఠ మలంకరింతురు. ఇట్లు ఇది గొప్ప అభీష్టవరప్రాప్తి స్థానముగా విలసిల్లుచుండును.

**రామస్తామర సేక్షణోజలధరశ్యామః కుమార్యా భువ**
**స్సంయుక్తః పరమానురక్త మనసా సౌమిత్రిణా సంయుతః**
**అక్షాది ప్రతిపక్ష వృక్ష విచరాధ్యక్షే సమీక్షారతః**
**శంఖారీషు శరాసనో వనతునో భద్రాద్రి మూర్ధ్నిస్థితః**

తా. తామర రేకులవంటి బహు సుందరములైన నేత్రములు గలవాడు, వర్షాకాలపు నీలమేఘమో యను నల్లని తిరుమేను సౌభాగ్యము గలవాడు, భూదేవి పుత్రియగు సీతాకుమారితో గూడియున్నవాడు. పరమ ప్రేమానురాగములు తొణికిసలాడు నెమ్మనముగల లక్ష్మణ పెరుమాళ్ళతో సేవలందువాడు, అక్షయ కుమారాది ప్రతి పక్ష వీర ప్రాణహరణ దక్షుడు, అంజనాగర్భ శుక్తిముక్తాఫలమగు ఆంజనేయాళ్వార్లపైన నిరంతరము అవ్యాజానుగ్రహము జూపువాడు సుదర్శన పాంచజన్య శరశరాసన కోదండపాణియై విరాజిల్లువాడు. భద్రుని పూర్వోత్తర పుణ్య విశేషములచే భద్రాద్రిపై అవతరించిన శ్రీరామచంద్ర పరబ్రహ్మమూర్తి మన కైహికాముష్మిక ఫలప్రదాతయై చిరకాలము శ్రీ భద్రగిరి శిఖరోజ్వలపారిజాతమై వెలుగొందుచు మనలను రక్షించుచుండుగాక!

**ఏతద్భద్రగిరీంద్ర పుణ్యచరితం శ్రీరామ నామాంకితం**
**శ్రద్ధాళుర్జపరూపతః పరిపఠేన్నిత్యం త్రికాలం సుధీః**
**సంసారాంబుధి మాశు వత్సపద వత్తీర్త్వాశు దుష్టా మయాం**
**ఛిత్వాతీవ మహాసుఖం భవభయం ముక్త్వావ్రజేద్రాఘవం.**

తా. శ్రీరామ నామాంకితము పరమ పావనమునైన ఈ భద్రాచల క్షేత్ర మహాత్మ్యమును శ్రద్ధాళువులై ప్రతినిత్యము త్రికాలములయందు జప విధాన రూపముగా ఏ మహనీయులు పారాయణమొనర్తురో అట్టి వారు సమస్త పాపరోగముల నుండి విముక్తులై మహాసముద్రము వంటి యీ సంసారమును గోవత్స పదము వలె సులభముగా దాటి భవభయవిదూరులై మహా సుఖ శాంతి సౌఖ్యభోగముల ననుభవించి, శ్రీ భగవద్రామతారక పరబ్రహ్మ పరమపద సాయుజ్య ప్రాప్తి నందగలరు.

**ఇతి శ్రీ బ్రహ్మపురాణే గౌతమీమహాత్మ్యే శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్య వర్ణనం నామ ద్వాదశోత్తర శతతమోధ్యాయః**

**ఓం తత్సత్ శ్రీ భద్రాచల శ్రీ సీతారామచంద్ర దివ్య చరణార విందార్పణమస్తు**



శ్రీ రామచంద్ర శ్రిత పారిజాత స్సమస్త కల్యాణ గుణాభిరామః
సీతాముఖాంభోరుహ చంచరీకో నిరంతరం మంగళమాతనోతు.

**మంగళం మహత్.**